క్లుప్తంగా

ఫుడ్‌బ్యాంక్‌ల ఏర్పాటు అభినందనీయం



ఫుడ్‌బ్యాంక్‌లో పేదలకు అన్నం వడ్డిస్తున్న దాతలు

విజయనగరం: పేదల ఆకలి బాధలను తీరుస్తున్న ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు ఆదర్శనీయమని మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు అన్నారు. స్థానిక కంటోన్మెంట్ ఫుడ్ బ్యాంక్‌లో దివంగత పిల్లా వేణుగోపాలరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు కార్పొరేటర్ పిల్లా రాధా భవాని ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన కొండలరావును ఉచిత రీతిన సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి, పిన్నింటి సూర్యనారాయణ, డి.ఎస్.పి లింగం తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం రూరల్: జిల్లాలోని 13 ఆదర్శ పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022–23 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి చదువుతూ పై తరగతికి అర్హత కలిగిన విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఐఎన్/ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఐఎన్ వెబ్‌సైట్‌లో ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చేనెల 11న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయా మండలాల్లోని ఆదర్శ పాఠశాలల్లోనే ప్రవేశపరీక్ష నిర్వహిస్తామన్నారు. ప్రవేశం రుసుముగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75లు, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150లు చెల్లించాలన్నారు.

12న పిడియాట్రిసిన్ పోస్టుకు ఇంటర్వ్యూ

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్యశాఖాధికారి పరిధిలో ఉన్న టెలిమెడిసిన్ హబ్‌లో పిడియాట్రిసిన్ పోస్టును కాంట్రాక్టు పద్ధతిపై భర్తీ చేస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణ కుమారి తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహిస్తామని చెప్పారు. విద్యార్హతలు విజయనగరం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఎంబీబీఎస్ ఉత్తీర్ణతతో పాటు ఏపీ మెడికల్ కౌన్సిల్ రిజిస్టర్ అయి ఉండాలన్నారు.

దళిత యువకుడి మృతికి కారకులను శిక్షించాలి

జామి: మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన దళిత యువకుడు స్వామినాయుడు మృతికి కారకులను శిక్షించాలని బహుజన నేత ఆతవ ఉదయ్‌భాస్కర్ డిమాండ్ చేశారు. ఈమేరకు మండల కేంద్రంలో మంగళవారం స్థానిక పత్రిక విలేకర్లతో మాట్లాడుతూ.. మార్చి 20న పావాడ నుంచి పనులు ముగించుకుని తిరిగి స్వగ్రామం వెళ్తున్న సమయంలో జామి నుంచి ఎస్‌కోట వెళ్తున్న ఆటో ఢీకొట్టడంతో స్వామినాయుడు మృతిచెందాడని, ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేయకుండా వదిలేశారని ఆరోపించారు. దళిత యువకుడి మృతికి కారణమైన వారిని తక్షణమే అరెస్ట్ చేయాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎద్దు సూరిదేముడు, అలమండ కోటరావు, కె.రామస్వామి, రామలక్ష్మణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులతో కంకర రోడ్డు

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి బీటీ రోడ్డు కోనేరు వరకు పంచాయతీ నిధులతో కంకర రోడ్డు పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ గర్భాపు విజయలక్ష్మి, శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం సుమారు 200 మీటర్ల రోడ్డుకు కంకర వేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ పంచాయతీ సాధారణ నిధులు సుమారు రూ.2.5 లక్షలతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

121 మందికి వైద్య సేవలు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట–2 గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. మరుపల్లి పీహెచ్‌సీ డాక్టర్ సాయికృష్ణారెడ్డి సుమారు 121 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ సంధ్య, ఆరోగ్య కార్యకర్త ఎ.సత్యవతి, డీఈఓ సంతోష్, హెల్త్ అసిస్టెంట్ ఈశ్వరరావు, ఆశాలు ఉమ, రాజేశ్వరి పాల్గొన్నారు.

నిధుల రికవరీకి సిఫార్సు

గంట్యాడ: జాతీయ ఉపాధిహామీ పథకంలో పనిచేసే వేతనదారులకు వేసే మస్తర్లలో దిద్దుబాటులు ఉన్నట్టు సోషల్ ఆడిట్ సిబ్బంది గుర్తించారు. ఈమేరకు సామాజిక తనిఖీల నివేదికను మంగళవారం అధికారులకు సమర్పించారు. మస్తర్ల దిద్దుబాటు చేసిన ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీ చేయాలని సిఫార్సు చేశారు. వసంత ఫీల్డ్ అసిస్టెంట్ రూ.5 వేలు, నరవ ఫీల్డ్ అసిస్టెంట్ రూ.5వేలు, పెదమజ్జిపాలెం రూ.400, జగ్గాపురం రూ.200, గంట్యాడ రూ.274, బోనంగి రూ.100 చొప్పున రికవరీ చేయాలని సిఫార్సులో పేర్కొన్నారు.

రెవెన్యూ సేవలు సులభతరం




విజయనగరం తహసీల్దార్ కార్యాలయం

- విజయనగరం అర్బన్ మండలం ఏర్పాటు చేస్తూ ఫైనల్ గజిట్ నోట్
- పట్టణ వాసులకు ప్రయోజనం
- త్వరితగతిన రెవెన్యూ సేవలు

విజయనగరం రూరల్: సచివాలయాల ఏర్పాటుతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు జిల్లాల్లో అర్బన్ మండలాలుగా విభజిస్తూ ప్రభుత్వం ఫిబ్రవరిలో ఉత్తర్వులు జారీ చేసింది. వాటిపై అభ్యంతరాల స్వీకరణ పూర్తి కావడంతో ఈ నెల 8న ఆఖరి గజిట్ నోట్ (జీవో నంబరు 210) జారీ చేయడంతో అర్బన్ మండలం ఏర్పాటు ఖరారైందని అధికారులు తెలిపారు. దీంతో జిల్లాలో అతిపెద్ద నియోజకవర్గంలో ఒకటైన విజయనగరం మండలంలో రెవెన్యూ సేవలు మరింత సులభతరంగా అందనున్నాయి. అర్బన్ మండలం ఏర్పాటు కావడంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

3 లక్షల జనాభా – ఒకటే తహసీల్దార్ కార్యాలయం

నియోజకవర్గం పరిధిలో మున్సిపల్ కార్పొరేషన్, విజయనగరం గ్రామీణ మండలం ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఉన్న 50 వార్డు సచివాలయాల పరిధిలో 2,39,951 మంది జనాభా ఉండగా, విజయనగరం మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో 13 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఉన్న 22 గ్రామ పంచాయతీల్లో, 43,599 మంది జనాభా నివసిస్తున్నారు. నియోజకవర్గం విస్తీర్ణం 29,226.69 హెక్టార్లలో విస్తరించి ఉంది. మెట్ట భూమి విస్తీర్ణం 10,874.81 హెక్టార్లు కాగా, పల్లం భూమి విస్తీర్ణం 7,954.44 హెక్టార్లు విస్తరించి ఉంది. నియోజకవర్గంలో తెలుపు రేషన్ కార్డును 71,839 మంది కలిగి ఉన్నారు. వీటిలో అర్బన్ పరిధిలోనే 58,598 లబ్ధిదారులు ఉన్నారు. అలాగే కార్పొరేషన్ పరిధిలో ఓటర్లు 2,01,206 మంది ఉండగా,



విజయనగరం మండలం మ్యాప్

గ్రామీణ మండల పరిధిలో 32,964 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గం అంతటికీ ఒకటే తహసీల్దార్ కార్యాలయం ఉండటంతో సేవల్లో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విజయనగరం కార్పొరేషన్‌తో పాటు, హజీసాహెబ్‌పేటతో అర్బన్ మండలంగా ఏర్పాటు చేస్తూ సోమవారం జీవో జారీ చేశారు. దీంతో అర్బన్ రెవెన్యూ కార్యాలయం ఏర్పాటు కావడంతో ధ్రువపత్రాల మంజూరు వేగవంతంతో పాటు రెవెన్యూ సమస్యలు త్వరతగతిని పరిష్కారమవుతాయి.

13 రెవెన్యూ గ్రామాలతో గ్రామీణ మండలం

13 రెవెన్యూ గ్రామాలతో గ్రామీణ మండలంగా గజిట్ నోట్ జారీ చేశారు. గ్రామీణ మండల పరిధిలో గుంకలాం, ద్వారపూడి, కొండకరకాం, సిరియాలపేట, రాకోడు, పినవేమలి, కోరుకొండ, సారిక, జొన్నవలస (జగన్నాథపురం), దుప్పాడ, చెలువూరు, నారాయణపురం, మలిచర్ల గ్రామాలను చేర్చారు.



విజయనగరం నియోజకవర్గం మ్యాప్

సమస్యలు త్వరగా పరిష్కారం



జిల్లా కేంద్రంలో ఉన్న విజయనగరం నియోజకవర్గం అతిపెద్దది కావడం, జనాభా ఎక్కువగా ఉండటంతో సేవల్లో కొంత జాప్యం ఏర్పడుతుంది. ఒకే రెవెన్యూ మండలంగా ఉన్న నియోజకవర్గాన్ని గ్రామీణ మండలాన్ని యథావిధిగా ఉంచి విజయనగరం కార్పొరేషన్, హజీసాహెబ్‌పేటలను అర్బన్ మండలంగా ఏర్పాటు చేస్తూ జీవో జారీ అయింది. కొత్తగా ఏర్పడిన అర్బన్ మండలంతో కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు త్వరితగతిన సేవలు అందుతాయి.

– చింతా బంగార్రాజు, తహసీల్దార్, విజయనగరం మండలం

విద్యతోనే గిరిజన అభివృద్ధి



పుస్తకావిష్కరణలో వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

- గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: గిరిజనుల జీవన స్థితిగతులను మెరుగుపరచడానికి విద్యే సరైన ఆయుధమని, విద్యతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి అన్నారు. 'గిరిజనుల విద్యాభివృద్ధి' అంశంపై సైకాలజిస్ట్, యూనివర్సిటీ పరిపాలన అధికారి డాక్టర్ ఎన్‌వీఎస్ సూర్యనారాయణ, ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్య కళాశాల సహాయాచార్యుడు డాక్టర్ రొబ్బా వరహాల దొర, డాక్టర్ జుట్టుక రాజమణి సంయుక్త సంకలనంలో తయారైన పుస్తకాన్ని స్థానిక యూనివర్సిటీలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఆర్థిక, సామాజిక, రాజకీయ, వ్యాపార రంగాలలో అభివృద్ధి, సమానత్వం వస్తాయని అన్నారు. డాక్టర్ సూర్యనారాయణ మాట్లాడుతూ దేశంలో వివిధ విశ్వవిద్యాలయాలలో పని చేస్తున్న అధ్యాపకులు, పరిశోధకులు గిరిజన విద్యా సంబంధమైన విషయాలపై పరిశోధన చేసి సమర్పించిన పరిశోధనా పత్రాల సంకలనమే ఈ పుస్తకమని అన్నారు. కార్యక్రమంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ విద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రొబ్బా వరహాల దొర తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనతో ముందుకు నడవాలి



ఆదర్శ ప్రొఫెసర్ శాంతమ్మకు పురస్కారం అందజేస్తున్న తెలుగు విశ్వ విద్యాలయం ప్రతినిధులు

- శాంతమ్మకు తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం

నెల్లిమర్ల రూరల్: ప్రతి ఒక్కరు లక్ష్య సాధనతో ముందుకు నడవాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఆదర్శ ప్రొఫెసర్ చిలుకూరి శాంతమ్మ సూచించారు. మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకొని టెక్కలి వర్సిటీలో తెలుగు విశ్వ విద్యాలయం, భాషా సాంస్కృతి శాఖ సంయుక్తంగా అందజేసే షష్టిపూర్తి కలాల సాహితీ పురస్కారాన్ని ప్రొఫెసర్ శాంతమ్మకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య విషయంలో ఎప్పుడూ తాను రాజీ పడలేదని, అవకాశాన్ని వినియోగించుకొని విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్నానని చెప్పారు. తెలుగు విశ్వ విద్యాలయం ప్రతినిధి వెంకటరామయ్య మాట్లాడుతూ 60 ఏళ్ల దాటిన మహిళ సాహితీవేత్తలకు పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తెలుగు విశ్వ విద్యాలయం వీసీ తంగేడి కిషన్‌రావు, వర్సిటీ వీసీ జీఎస్ఎన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

90 శాతం రాయితీపై బిందుసేద్యం పరికరాలు



బిందుసేద్యం పరికరాలను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీనారాయణ

బొండపల్లి: సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై బిందు సేద్యం పరికరాలను ప్రభుత్వం అందిస్తోందని ఏపీఎంఐపీ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని అంబటివలస ఆర్బీకే పరిధిలోని అయ్యన్న అగ్రహారం, అంబటివలస గ్రామాల్లో ఏర్పాటు చేసిన బిందుసేద్యం పరికరాల పనితీరును క్షేత్ర స్థాయిలో ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో 30 ఎకరాల్లో రూ.7.29 లక్షలు విలువైన పరికరాలను 90 శాతం రాయితీపై అందించడం జరిగిందన్నారు. అలాగే 2023–24 ఆర్థిక సంవత్సరంలో మండలంలో 85 ఎకరాల్లో సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 50 శాతం రాయితీపై పరికరాలను అందించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గజపతినగరం ఉద్యానవనశాఖ అధికారి ఎ.రాజశేఖర్, ఏపీఎంఐపీ అధికారి సునీల్, ఆర్బీకే సహాయకులు జి.సునీల్‌కుమార్, ఫినోలెక్స్ కంపెనీ ప్రతినిధి శ్రీచక్ర తదితరులు పాల్గొన్నారు.

ఐదు కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న రైల్వే ఓల్డ్ కాలనీలో ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు మంగళవారం తెలిపారు. రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో గంజాయి ఉందన్న సమాచారాన్ని తెలుసుకుని ఎస్ఐలు భాస్కరరావు, అశోక్ కుమార్, సిబ్బందితో విస్తృత తనిఖీలు చేపట్టామన్నారు. కేసు నమోదు చేసి, ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఉపాధి కూలీ కుటుంబాన్ని ఆదుకోవాలి

శృంగవరపుకోట: వడదెబ్బతో మృతి చెందిన ఉపాధి కూలీ కుటుంబానికి కాంపోజిషన్ గ్రాంట్ నుంచి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ శేషుబాబుకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. కృష్ణాపురం గ్రామానికి చెందిన రేపాక నారాయణమ్మ(55) ఈ నెల 8న ఉపాధిహామీ పనులకు వెళ్లి తిరిగి వచ్చి, కళ్లంలో పశువులకు నీరు పెడుతుండగా సృహకోల్పోయి అక్కడే ప్రాణాలు కోల్పోయింది. వడదెబ్బకు గురికావడంతోనే ఆమె మృతి చెందిందని, ఆమె కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో చెల్లించి ఆదుకోవాలని కోరారు. అలాగే కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా మృతి చెందిన కార్మికులకు ఇస్తున్న పరిహారంతో పాటు పిల్లల పెళ్లిళ్లు, కాన్పులకు ఇచ్చే అలవెన్స్‌లు, స్కాలర్‌షిప్‌లు, మెడికల్ అలవెన్స్‌లు తక్షణమే అమలు చేయాలని, కార్మిక సంక్షేమ బోర్డు నిధులను కార్మికుల కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధిహామీ పనులు ఒక్కపూట నిర్వహించేలా ఆదేశాలు విడుదల చేయాలని కోరారు.

కిట్లు పంపిణీపై హెచ్‌ఎంలకు అవగాహన



మాట్లాడుతున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: జగనన్న విద్యాకానుక కిట్లు ఇప్పటికే మండలానికి చేరాయని, త్వరలోనే వాటిని విద్యార్థులకు పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ విమలమ్మ తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచేందుకు, నాణ్యమైన బోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని సూచించారు. జగనన్న విద్యాకానుక కిట్లను విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఉపాధ్యాయులంతా సిద్ధంగా ఉండాలన్నారు.

పైడిమాంబ సేవలో డిప్యూటీ మేయర్



నిత్యాన్నదాన కార్యక్రమానికి చెక్కు అందజేత

విజయనగరం: భక్తుల కొంగు బంగారం, విజయనగరం ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారిని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మంగళవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు ఆశీర్వచనాలు అందించారు. దేవస్థానం అధికారులు అమ్మవారి ప్రసాదం అందజేశారు. అనంతరం విజయనగరం ప్రదీప్‌నగర్‌కు చెందిన పేరం రమణారెడ్డి, విజయలక్ష్మి దంపతులు అమ్మవారి నిత్యాన్నదానం కార్యక్రమానికి రూ.1,00,116 లు విరాళంగా అందజేశారు. ఈ మేరకు సంబంధిత చెక్కును ఆలయ ఈఓకు కోలగట్ల శ్రావణి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బాల బ్రహ్మారెడ్డి, బోర్డు మెంబర్ అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మారమ్మతల్లి ఆశీస్సులు అందరిపై ఉండాలి



మారమ్మతల్లికి పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: స్థానిక దాసన్నపేట, కాపు వీధిలో జరిగిన మారమ్మ తల్లి ఉత్సవంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి బుధవారం పాల్గొన్నారు. అమ్మవారి రథోత్సవ వేడుకల్లో పాల్గొని మారమ్మతల్లి ఆలయాన్ని దర్శించుకున్నారు. మారమ్మతల్లి మూల విరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మ ఆశీస్సులు అందుకున్నారు. అమ్మవారి రథోత్సవం నేపథ్యంలో అంజలి రథం, ఎల్లటేనుగు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తజన సందోహంతో జరిగిన రథోత్సవం జగన్నాథస్వామి ఆలయం నుండి మారమ్మతల్లి ఆలయం వరకు మూడుసార్లు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ మారమ్మతల్లి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారునాయుడు, స్థానిక కార్పొరేటర్లు ఆల్తి సత్యకుమారి, పొంతపల్లి మాలతి, జోనల్ ఇన్‌చార్జి బొద్దాన అప్పారావు, బోడసింగి ఈశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆల్తి శ్రీనివాసరావు, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం..'లో సమస్యల పరిష్కారం



జగనన్నకు చెబుదాంలో పాల్గొన్న ఎంపీడీఓ రామారావు తదితరులు

పూసపాటిరేగ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారం అవుతాయని ఎంపీడీఓ జి.రామారావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం.. 1902 కార్యక్రమాన్ని టెలివిజన్‌లో మంగళవారం వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో కాలంగా అపరిష్కృతంగా వున్న సమస్యలు జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా వెంటనే పరిష్కారం అవుతాయన్నారు. 1902 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి నాణ్యమైన సత్వర పరిష్కారం పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



బాధితురాలికి బ్యాగ్‌ను అప్పగిస్తున్న సీఐ వెంకటరావు

- పోగొట్టుకున్న బంగారు వస్తువుల బ్యాగ్ బాధితురాలికి అప్పగింత

విజయనగరం క్రైమ్: పోగొట్టుకున్న బంగారు వస్తువుల బ్యాగ్‌ను బాధితురాలికి అప్పగించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు తెలిపిన వివరాలు... విశాఖకు చెందిన ఎస్.వరలక్ష్మి విజయనగరంలోని ఎస్ కన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరై తిరిగి ఆటో ఎక్కారు. విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆటో దిగి, బ్యాగ్ ఆటోలో మర్చిపోయారు. తర్వాత విషయం తెలుసుకుని వెంటనే వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ అశోక్‌కుమార్ తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. ఈలోగా ఆటో డ్రైవర్ భాస్కరరావు నిజాయితీతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కి వచ్చి బ్యాగ్‌ను సీఐకు అప్పగించారు. బ్యాగ్‌లో సుమారు 2 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. నిజాయితీతో బ్యాగ్‌ను అప్పగించిన ఆటో డ్రైవర్ భాస్కరరావుకు బాధితురాలు కృతజ్ఞతలు తెలిపారు. ఆటోడ్రైవర్‌ను సీఐ అభినందించారు.

ఖరీఫ్‌కు సన్నద్ధం



వ్యవసాయశాఖ సిబ్బందినుద్దేశించి మాట్లాడుతున్న జేడీ రామారావు

శృంగవరపుకోట: ఖరీఫ్‌లో రైతాంగం అవసరాలు తీర్చేలా పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలని జిల్లా వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకుడు రామారావు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఎస్.కోట ఆర్బీకేలో కొత్తవలస సబ్‌డివిజన్ స్థాయిలోని వ్యవసాయ అధికారులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖరీఫ్‌లో డివిజన్ పరిధిలో సాగు చేయనున్న పంటల వివరాలు, విస్తీర్ణం, విత్తన లభ్యత, డిమాండ్, ఎరువులు, పురుగు మందుల లభ్యతను తెలుసుకుని, రైతాంగానికి కావాల్సిన ఇండెంట్లను సిద్ధం చేయాలన్నారు. సీఓపీసీ కార్డుల ప్రాధాన్యతను వివరించి వాటి రెన్యూవల్స్‌ను వేగవంతం చేయాలని కోరారు. పీఎం కిసాన్ పథకంలో ఈకేవైసీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ఉద్దేశాన్ని, లక్ష్యాలను వివరించి అందుకు సమాయత్తం కావాలని కోరారు. విధి నిర్వహణలో అలక్ష్యం చేసినా, విధులకు డుమ్మా కొట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హాజరైన కొత్తవలస ఏడీఏ ఎల్.విజయ ఐదు మండలాల వ్యవసాయాధికారులు, ఏఈఓలు, వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మిద్దాం..

- ఏఎస్పీ అస్మాపర్వీన్



మాట్లాడుతున్న ఏఎస్పీ అస్మాపర్వీన్

శృంగవరపుకోట: మత్తులో మన సమాజం గాడి తప్పుతోంది. నేరాలకు, ఘోరాలకు ప్రధాన కారణం మత్తు. ఆ మత్తును వదిలిస్తే మన సమాజం బాగుపడుతుందని ఏఎస్పీ అస్మాపర్వీన్ అన్నారు. స్థానిక ఎస్ఈబీ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించి, రికార్డులు పరిశీలించారు. అనంతరం సీఐ ఎస్.ధర్మారావుతో కలిసి ఎస్.కోట, జామి మండలాల మహిళా పోలీసులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాలు బాగుపడాలంటే మీ సహకారం కావాలి. గ్రామాల్లో సారా, గంజాయి వ్యాపారాలు ఉన్నా, జూదం, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నా వెంటనే సమాచారం ఇవ్వాలని, మీకు ఇబ్బంది అనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు విషయం చెప్పాలన్నారు. డ్రగ్స్ వల్ల ఎదురవుతున్న దుష్పరిణామాలను వివరిస్తూ, మీకు ఉద్యోగాలిచ్చింది మంచి సమాజం నిర్మాణం కోసం అన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కర్తవ్య నిర్వహణలో తొలుత ఇబ్బందులు ఎదురైనా.. క్రమంగా ఆశించిన మద్దతు దక్కుతుందన్నారు. యువతకు డ్రగ్స్ వాడకం వల్ల కలిగే నష్టాలను, కూలిపోతున్న కుటుంబ వ్యవస్థను వివరించాలన్నారు.